గాలయ్య. అతని కండ్లవెంట నీళ్లు కారుతున్నయి.

''ఏంది బిడ్డా ఏడుస్తున్నవు! నాయిన్న యాదికచ్చిండా!?'' అన్నది లచ్చవ్వ.. కొడుకు భుజంమీద చెయ్యేసి.

''అవునే అవ్వా! నాయిన్న యాదికచ్చిండు. మనింట్లనే బతికి మనకోసమే బతికి చనిపోయిన గట్టయ్య మామ యాదికత్తుండు. నాతోని చదువుకున్నోళ్లంత యాదికత్తంద్రు. వాళ్లెవ్వలు కనవడ్తలేరే! చాలా ఇండ్లకు తాళాలు కనవడ్తున్నయే అవ్వ! కొన్ని ఇండ్ల ముంగట కొడుకుల కోసురం ఎదిరిచూస్తున్న నీ అసోంటి తల్లులు గలుమలకాడ కూసుండి కనవడ్తున్నరు. ఎవుసాలు మూలకు వడ్తున్నయి. కులకస్పి పనులన్ని మూలకు పడ్డట్టనిపిస్తందే అవ్వ..'' అని ఏడ్వబట్టిండు గాలయ్య.

తెల్లవారి భారమైన మనసుతో హైదరాబాద్ ఎల్లిపోయిండు.

* * *

కాలమిప్పుడు జెట్ స్పీడుతో పరుగెడుతంది. యాంత్రీకరణ ప్రభావంతో చరమదశకు వచ్చిన కులవృత్తులు.. ఇప్పుడు మరీ దెబ్బతిన్నాయి. తండ్రి చనిపోయిన తర్వాత గాలయ్య కుటుంబానికున్న మందను చూసుకునే దిక్కులేక.. గొర్రెలను అమ్మేయాల్సి వచ్చింది. భూములు, ఇల్లు కూడా ఊళ్లో ఉండే గాలయ్య చెల్లెకే దక్కినయి. పట్నంలో ఉన్న గాలయ్య.. తల్లిని చూసుకునే స్థితిలో లేడు కాబట్టి.. ఉన్నభూములు, ఇల్లు తీసుకొని తల్లిని చూసుకోవాలని ఊరి పెద్దమనుషులిచ్చిన తీర్పును గాలయ్య శిరసావహించిండు. కొన్నేండ్లలో గాలయ్య తల్లి కూడా ఈ లోకాన్ని వదిలింది. దాంతో.. ఊరితో సంబంధాలు తగ్గుముఖం పట్టినయి.

ఇపుడు సెల్‌ఫోన్ యుగం... కాలం మనోవేగంతో పరుగులు తీస్తంది. 21వ శతాబ్ది రెండవ దశాబ్దం నడుస్తంది. గాలయ్య పదవీవిరమణ పొందిండు. అతని పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడింద్రు. హైదరాబాద్‌లో వాళ్లకు సొంత ఇండ్లున్నయి. కానీ, ఊరిని – కులకస్పిని ప్రేమించిన గాలయ్యకు ఊళ్లో ఇంచుభూమి కూడా లేదు. నిలువనీడ లేదు. ఊరిపై ప్రేమ, ఊళ్లో స్థిరపడాలన్న బలమైన కోర్కె మాత్రముంది. చాలా ఏండ్ల తర్వాత చిన్నప్పటి సోపతి డాక్టర్ రాఘవరెడ్డితో కలిసి ఊరెళ్లిండు గాలయ్య. రాఘవరెడ్డి, గాలయ్య వచ్చింద్రని తెలిసి చాలామంది వచ్చి కలిసిపోతున్నరు.

''గాలన్నా! నీ పిల్లలు హైదరాబాద్‌లున్నా, వాళ్లకిండ్లున్నా.. నీకైతె ఊళ్లె ఓ ఇల్లుండాలె! రెండెకురాలన్న పొలముండాలె! భూమి కొనుక్కో. శేషజీవితం ఇక్కణ్నే గడుపు!''.. చాలామంది ఇదే మాటన్నరు.

చిన్నప్పుడు గట్టుమామ మాటలు యాదికచ్చినయి..

''నాకూ అదే ఆలోచనుంది. చాలా కాలమైంది గదా! చూసిపోదామని వచ్చిన. రేపు పొద్దున ఊరంత తిరుగుత!'' అన్నడు గాలయ్య.

ఉదయం రాఘవరెడ్డితో కలిసి ఊళ్లో తిరుగుతున్న గాలయ్య ముఖంలో ఏదో తెలియని ఆనందం.

ఎవ్వలు ఎదురచ్చినా..

''గాలన్నా.. నమస్తే!''..

''గాలన్నా.. శనార్తులు! మంచిగున్నారె.. ఊర్ను మరిసిపోతివి!''..

''ఊళ్లె భూమి కొనుక్కోయే!''..

''ఊళ్లె ఇల్లు గట్టుకో గాలన్నా!''..

ఇవే మాటలు. బిగ్గీత కౌగిలింతలు.. ప్రేమలు!

నగర జీవితంతో ముఖం వాచున్న గాలయ్యకు తన ఊరివారి ఆప్యాయ పలుకరింపులు చెప్పలేనంత ఆనందాన్ని ఇస్తున్నాయి.

ఇద్దరూ మెండె రాజన్న కొడుకు పోచన్న ఇంటికెళ్లింద్రు. టీ తాగి మాటల్లో పడ్డరు.

''బాపూ! నేను బీఏ చేసినా కులకస్పిల్నే ఉన్న. ఇపుడు నాకు నాలుగువందల గొర్లమందుంది. ముప్పై ఎకరాల భూముంది. నా పిల్లలందర్నీ చదివించిన. నౌకర్లయినయి. నువ్వు పట్నంల ఏం సంపాదించినవో తెలువది కానీ.. పుట్టినూర్లనైతె ఏం లేకుంటయింది. చదువుకొని ఉద్యోగం చేయడం తప్పంటలేను. కానీ.. ఊర్ల భూమిని, ఇంటిని పోగొట్టుకునుడే మంచిగనిపిస్తలేదు. హైదరాబాద్‌ల నువ్వు శ్రీరామకోతులల్ల బోడకోతి అసోంటినివి. ఇక్కడ భూమున్నా, ఏ కస్పి ఉన్నా గౌరవమే కదా!''..

పోచన్న మాటలు వింటున్న గాలయ్యకు దుఃఖం ఆగడంలేదు. కళ్లవెంట పటపటా నీళ్లు కారుతున్నయి.

''బాపూ! నిన్ను నేనేమన్న బాధపెట్టిన్నా! ప్రొఫెసర్‌గ, సామాజిక కార్యకర్తగ నీకెంతో పేరుంది. ఊరుమీద మస్తు పాయిరముంది. మీ నాయిన్న, మా నాయిన్న కాలంల ఉన్నట్టు ఇప్పుడు ఏ కులం వాళ్లు ఆపనే చేసుకుంట బతుకుత లేరు. అందరు చదువుకుంటున్నరు. మునుపు భూములు లేనోళ్లు ఇప్పుడు భూములు కొనుక్కున్నరు. ఉన్నోళ్లు పోగొట్టుకున్నరు. బట్టల ముల్లె నెత్తిమీద పెట్టుకొని ఇండ్లపొంటి తిరుగుకుంట అమ్మిన రామయ్య కొడుకు ఇప్పుడు బిల్డరయిండు. ఇరవై ఎకరాల భూములు కొన్నడు. జడ్పీటీసీ అయిండు. రేపు ఎమ్మెల్యే కావచ్చు..'' అన్నడు పోచన్న.. గాలయ్యను ఓదార్చుకుంట.

''పోచన్నా! పీజీలు, పీహెచ్‌డీ చేసిన నాకు లేని అవగాహన నీకున్నది. మరి నేను కులకస్పిని వదిలి చదువుకునుడు తప్పంటవా? ఎవుసాయాలు, వృత్తిపనుల సంగతేంటి?'' అన్నడు గాలయ్య.

''బాపూ! మెడకాయమీద తలుకాయ ఉన్నోడెవ్వడు గట్లనడు. ఊళ్లల్ల వ్యవసాయాలు సంక్షోభంల పడ్డంక చదువుకున్నోళ్లంత భూమితోని, ఊళ్లతోని తెగదెంపులు జేసుకున్నమాట నిజమే! కానీ, భూమి గుండ్రంగ ఉన్నదంటరు చూడు.. గది నిజమని గిప్పటి పరిస్థితులను జూత్తె అర్థమైతంది. సమాజం ఒక వర్తులాన్ని పూర్తిచేసుకుంది. భూమ్మీద ప్రేమ పెరిగింది. ఊళ్లమీదా ప్రేమ పెరుగుతంది. అందుకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడ ఊళ్లకొచ్చి భూములు కొంటున్నరు. అమెరికాకు పోయచ్చినోళ్లు, ఇంజనీర్లు గూడ భూములు కొని ఎవుసం చేయాలనుకుంటున్నరు. అప్పుడైనా, ఇప్పుడైనా, ఎప్పుడైనా.. వస్తున్న మార్పుల కనుగుణంగ తనను తాను మార్చుకున్నోడే నిలిచి గెలుస్తడు. పట్నాలకు దూరంగ పల్లెల్ల ఫాంహౌస్‌లు కట్టుకుంటున్నోళ్లు కనడ్తలేరా బాపు!''.

పోచన్న మాటలకు నోరెళ్లబెట్టి చూస్తున్నడు గాలయ్య.

''పోచన్నా! నేను ఎంత చదివినా నా చదువు అనుభవాలు నీ గ్రామీణ, వ్యావసాయిక, కులకస్పిపర అనుభవాల ముందు దిగదుడుపే.. నాకిప్పటికీ 'కులకస్పి' అనే పదంపై స్పష్టమైన అవగాహన లేదు. చెప్పుతవా!'' అన్నడు.

''కులకస్పి అంటె ఏదైనా వృత్తికి సంబంధించిన పని. అంటే.. ఏదైనా ఉత్పత్తికి సంబంధించిన పనిలో నైపుణ్యం సంపాదించాల్నని. ఈ వృత్తి, ఉత్పత్తికి సంబంధించిన పనులు అన్ని దేశాలల్ల ఉంటయి. వాటితోనే ఏ దేశంలనైన ఎక్కువమంది బతుకుతరు. ప్రభుత్వ ఉద్యోగాలతోని ఎంతమంది బతుకుతరు? ఎన్నేండ్లు బతుకుతరు? ఇరవై ఐదేండ్ల దాకా బాల్యం.. చదువేనాయె! అరవై ఏండ్లతర్వాత పదవి దిగి పోవుడేనాయె. మరి మిగతా జనం, మిగతా కాలం ఎట్ల బతుకాలె? ఏదో పని జేసుకుంట బతకాలె. గదే కులకస్పి. అంటే గీపని జేసెటోళ్లు, చేద్దామనుకునెటోళ్లు చదువుకోవద్దని కాదు.. వేరే దేశాలల్ల అందరు బాగ సదువుకొని ఏపనైన జేసుకుంటరు. కొద్దిమంది నౌకర్లు జేత్తరు. గక్కడ కస్పికి వృత్తిపనికి గౌరవముంటది. గదాన్నే మీ అసోంటోళ్లు 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' అంటరు. గా డిగ్నిటీ ఆఫ్ లేబర్ మన దగ్గర లేకపోయేపటికెనె గిన్ని సమస్యలు. చదువుకున్నా, నౌకరి రాకుంటె ఏదైన వృత్తిపనిల నైపుణ్యముంటే సుఖంగ బతుకచ్చు గద! కులకస్పంటె ఏ కులపోళ్లు ఆ కుల వృత్తి మాత్రమే చేసితీరాలి. చదువుకోవద్దని కాదు.. గిప్పుడర్థమైందాయె!'' అన్నడు పోచన్న.

''పోచన్నా! నేనిప్పుడు రిటైరయి ఉన్న! నా చిరకాల స్వప్నమైన 'ఊళ్లో స్థిరపడటం' అనే కోర్కెను తీర్చుకుంట. ఇక్కడే ఇల్లు కట్టుకుంట. ఊళ్లో ఎన్ని మార్పులచ్చినయని చెప్పుతున్నా.. పట్నాలల్ల వచ్చినట్టు కృత్రిమత్వం రాలేదు. పెదవులపై మాటలు రాలేదు. వరుసలు పెట్టుకొని పిలుచుకోవడాలు, అలాయిబలాయ్‌లు ఇంకా సజీవంగున్నయి. పట్నమోల్లోలె వ్యాపార మనస్తత్వం రాలేదు. మునుపటంత ప్రేమలు లేకున్నా పట్నాల్లోలా ప్రేమరాహిత్యం.. ఈ ఊళ్లల్ల లేదు. నేను 'కులకస్పి'తో ఈ ఊళ్లనే శేషజీవితం గడుపుత. గొర్లు, భూమి కొని వాటిపై వచ్చే ఆదాయంతోని బతుకుత. నా పిల్లలు వాళ్ల పిల్లలతరం నాటికైనా నన్ను అనుసరిస్తరన్న ఆశ నాకుంది. అప్పటికి నేనుండకపోవచ్చు. మనదేశంల కులకస్పిని కులాలకు అతీతంగ అనుసరిస్తే ఇంకొన్నేండ్లకైన కులాలు పోతయేమొ?.. పోతయన్న ఆశ నాకుంది..'' అన్నడు గాలయ్య. ■

## కాలువ మల్లయ్య



కులవృత్తుల గొప్పదనాన్ని, పల్లెవాసుల స్వచ్ఛమైన మనస్తత్వాన్ని తెలిపే కథ.. కులకస్పి. గొల్లబోయెల జీవిత నేపథ్యంలో సాగే ఈ కథా రచయిత డా. కాలువ మల్లయ్య. దాదాపు 50 ఏండ్లకు పైగా సాగుతున్న సాహితీ ప్రయాణం వీరిది. 'సామాజిక ప్రయోజనం లేని సాహిత్యం వృథా' అని నమ్మే రచయిత. వీరి స్వస్థలం పెద్దపల్లి జిల్లా తేలుకుంట. ఎమ్మెస్సీ బీఈడీ, పీజీ డీపీఆర్, ఎంఏ, పీహెచ్‌డీ చేశారు. బాల్యం నుంచే సాహిత్యాభిలాష పెంచుకున్నారు. 1972లోనే కథా రచన మొదలుపెట్టారు. తనదైన యాసలో రచనలు సాగిస్తూ.. తెలంగాణ జీవద్భాషకు సాహిత్య గౌరవం తీసుకువస్తున్నారు. 1983లో రాసిన 'వెలి' కథ.. కాలువ మల్లయ్యను అభ్యుదయ రచయితగా సమాజానికి పరిచయం చేసింది. ఇప్పటివరకూ వెయ్యికిపైగా కథలు, 18 నవలలు, 6 కవితా సంపుటాలు, 800 వ్యాసాలు రాశారు. 70 పుస్తకాలు ప్రచురించగా, 100కుపైగా పుస్తకాలు ఇంకా ప్రచురించాల్సి ఉన్నది. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 30 మందికిపైగా విద్యార్థులు, వీరి సాహిత్యంపై పీహెచ్‌డీ, ఎంఫిల్ పట్టాలు తీసుకున్నారు. మరో పదిమందిదాకా పరిశోధనలు చేస్తున్నారు. 'బతుకు పుస్తకం' నవలకు 'ఆటా అవార్డు' దక్కించుకున్నారు. ఇప్పటిదాకా 90కిపైగా వివిధ పురస్కారాలు, అవార్డులు, అనేక సన్మానాలు అందుకున్నారు.